క్లుప్తంగా

ఏపీఈఏపీ సెట్ ప్రవేశ ప్రక్రియ పరిశీలన



విద్యార్థులు, వారి తల్లిదండ్రులతో మాట్లాడుతున్న వీసీ ప్రసాదరెడ్డి

బీచ్ రోడ్డు: ఆంధ్రా యూనివర్సిటీలో జరుగుతున్న ఏపీ ఈఏపీ సెట్ ప్రవేశాల ప్రక్రియను ఏయూ వీసీ ప్రసాదరెడ్డి శుక్రవారం పరిశీలించారు. 23వ తేదీ నుంచి జరుగుతున్న అడ్మిషన్స్ ప్రక్రియ ఎలా సాగుతుందో అడిగి తెలుసుకున్నారు. విద్యార్థులు, వారి తల్లిదండ్రులతో మాట్లాడి, కౌన్సెలింగ్ ప్రక్రియపై ఆరా తీశారు.

నేత్రదానంపై అవగాహన అవసరం

ఆరిలోవ: ప్రజలు నేత్రదానంపై అవగాహన కలిగి ఉండాలని ఎల్‌వీ ప్రసాద్ కంటి ఆస్పత్రి వైద్య నిపుణుడు డాక్టర్ రోహిత్ దురేజా తెలిపారు. 38వ నేత్రదాన పక్షోత్సవం శుక్రవారం హనుమంతవాక వద్ద ఎల్‌వీ ప్రసాద్ కంటి ఆస్పత్రిలో నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ సెప్టెంబరు 8 వరకు ఈ ఉత్సవాలు జరుగుతాయన్నారు. ప్రతి ఒక్కరూ నేత్రదానం చేస్తామని తనకు తాను ప్రతిజ్ఞ చేసుకోవాలన్నారు. కార్నియా అంధత్వ నివారణకు అంతా సహకరించాలని ఆయన కోరారు. మరణానంతరం కార్నియా దానం చేయడానికి అందరూ ముందుకు రావాలని పిలుపునిచ్చారు. ఈ కార్యక్రమంలో పలువురు కంటి వైద్యులు పాల్గొన్నారు.

మర్యాద పూర్వక కలయిక



సుబ్బారెడ్డిని కలిసిన జాతీయ బీసీ సంక్షేమం నేత సురేష్

బీచ్ రోడ్డు: వైఎస్సార్‌సీపీ రీజినల్ కో–ఆర్డినేటర్ వై.వి.సుబ్బారెడ్డిని జాతీయ బీసీ సంక్షేమ సంఘం ప్రధాన కార్యదర్శి పెరిక సురేష్ శుక్రవారం నగరంలోని ఒక హోటల్‌లో మర్యాద పూర్వకంగా కలిశారు. తిరుమలలో అఖిల భారత హిందూ మహాసభకు ప్రత్యేకమైన వసతి గృహాన్ని ఏర్పాటు చేసేలా సీఎం దృష్టికి తీసుకెళ్లాలని కోరారు. నేపాల్ దేశం ఖాట్మాండులోని శ్రీపశుపతినాథ్ దేవాలయం నుంచి తీసుకొచ్చిన ప్రసాదాన్ని సుబ్బారెడ్డికి అందజేశారు. ఈ కార్యక్రమంలో జాతీయ బీసీ సంక్షేమ సంఘం అధికార ప్రతినిధి కర్రి వేణుమాధవ్ పాల్గొన్నారు.

అంతర్జాతీయ విద్యకు ఏయూ ప్రోత్సాహం

బీచ్ రోడ్డు: అంతర్జాతీయ విద్యను ఏయూ విద్యార్థులకు అందించాలనే ఉద్దేశంతో ప్రోత్సహిస్తున్నామని వర్సిటీ రెక్టర్ మమత తెలిపారు. శుక్రవారం వైఎస్ మూర్తి ఆడిటోరియంలో జరిగిన ఇండో–యూకే ఎడ్యుకేషన్ ఫోరం సదస్సును ఆమె ప్రారంభించారు. అనంతరం రెక్టార్ మాట్లాడుతూ అంతర్జాతీయ విద్యను ప్రోత్సహించడంలో భాగంగా అనేక విదేశీ విద్యా సంస్థలతో ఎంవోయూలు చేసుకుంటున్నామని చెప్పారు. శుక్రవారం కూడా యూకేకు చెందిన రెండు యూనివర్సిటీలతో ఒప్పందాలు చేసుకున్నామన్నారు. విద్యార్థులకు మంచి భవిష్యత్తు అందించడమే లక్ష్యంగా ఏయూ ముందుకు సాగుతుందన్నారు. ఈ సందర్భంగా యూకేలో అందిస్తున్న కోర్సులపై అవగాహన కల్పించారు.

రైల్వే స్టేషన్‌లో ఎంపీ జీవీఎల్ తనిఖీలు

తాటిచెట్లపాలెం: విశాఖపట్నం రైల్వే స్టేషన్‌లో శుక్రవారం ఉదయం రాజ్యసభ సభ్యుడు జీవీఎల్ నరసింహారావు ఆకస్మిక తనిఖీలు చేపట్టారు. స్టేషన్‌లో ప్రయాణికులు, పారిశుధ్య కార్మికులతో ఆయన మాట్లాడారు. పలు సమస్యలను ప్రయాణికులు జీవీఎల్‌కు తెలియజేయగా.. వాటిని అధికారుల దృష్టికి తీసుకెళ్లి పరిష్కరించేందుకు కృషి చేస్తానని హామీ ఇచ్చారు.

మహనీయులు.. సరికొత్తగా..

- తీరం చెంతన విగ్రహాలకు రక్షణగా గొడుగుల ఏర్పాటు
- రాత్రి వేళ కనువిందు చేసేలా విద్యుత్ వెలుగులు
- పనులు పూర్తి చేసిన విశాఖ పోర్టు ట్రస్ట్ అధికారులు



గొడుగులు ఏర్పాటు చేస్తున్న సిబ్బంది



ఆదర్శమూర్తులకు గొడుగుల ఏర్పాటు



వెలుగులో మహనీయులు

బీచ్ రోడ్డు: దేశ స్వాతంత్ర్యం కోసం పోరాటం చేసిన యోధులు, సమాజాభివృద్ధికి శ్రమించిన మానవతావాదులు, పలు రంగాల్లో విశేష సేవలందించిన ఆదర్శప్రియులు, రాజకీయవేత్తలు ఇలా ఎంతో మంది మహనీయుల విగ్రహాలు సాగర తీరాన కొలువుదీరి ఉన్నాయి. విగ్రహాలను అయితే ఏర్పాటు చేశారు కానీ.. వాటి రక్షణ, పరిశుభ్రత, విద్యుత్ వెలుగుల విషయాన్ని మాత్రం గాలికి వదిలేశారు. ఇప్పుడు విశాఖ పోర్టు ట్రస్ట్ ఆదర్శమూర్తులకు అండగా నిలిచింది. విగ్రహాలకు గొడుగులు, లైటింగ్స్ ఏర్పాటు చేసి సందర్శకులతో అభినందనలు అందుకుంటోంది. తీరం చెంతన కొలువుదీరిన మహనీయుల విగ్రహాలు సరికొత్తగా దర్శనమిస్తున్నాయి. ఎండకు ఎండుతూ.. వానకు తడుస్తూ పాడైపోతున్న విగ్రహాల రక్షణకు పోర్టు ట్రస్ట్ అధికారులు చర్యలు చేపట్టారు.

అపరిశుభ్రత నుంచి విముక్తి

సాగరతీరంలో ఏర్పాటు చేసిన విగ్రహాలకు ఎటువంటి నీడ, రక్షణ గోడ లేదు. దీంతో విగ్రహాలపై పక్షులు వాలి పాడు చేస్తున్నాయి. అవి కళావిహీనంగా దర్శనమివ్వడంతో సందర్శకులు అసంతృప్తి వ్యక్తం చేస్తున్నారు. విగ్రహాలను చూసేందుకు ఆసక్తి కూడా చూపడం లేదు. మహనీయుల జయంతి, వర్ధంతి రోజుల్లో నివాళులర్పించే సమయంలో చాలా ఇబ్బందులు ఎదురవుతున్నాయి. ఈ సమస్యలకు పోర్టు ట్రస్ట్ అధికారులు పరిష్కారం చూపుతూ విగ్రహాలకు రక్షణ చర్యలు చేపట్టారు. తీరంలో ఉన్న అన్ని విగ్రహాలకు గొడుగులు ఏర్పాటు చేశారు. దీంతో ఆదర్శమూర్తులకు నీడతో పాటు, పక్షుల బెడద నుంచి విముక్తి కలిగింది. విగ్రహాలు చూడడానికి చాలా పరిశుభ్రంగా కనిపిస్తున్నాయి.

విద్యుత్ కాంతుల్లో మహనీయులు

సందర్శకులకు మహనీయుల కోసం తెలియాలని విగ్రహాలను ఏర్పాటు చేశారు. అయితే తీరానికి సందర్శకులు ఎక్కువగా సాయంత్రం, రాత్రి సమయంలో వస్తారు. తీరంలో ఏర్పాటు చేసిన విగ్రహాల వద్ద విద్యుత్ వెలుగులు లేకపోవడంతో అటువైపు వెళ్లేందుకు సందర్శకులు ఆసక్తి చూపడం లేదు. ఇప్పుడు మహనీయుల విగ్రహాల వద్ద విద్యుత్ దీపాలు ఏర్పాటు చేశారు. ముఖం కనిపించేలా ఒక లైట్, వారి వివరాలు తెలిపే పలక కనిపించేలా ఒక లైట్‌ను ఏర్పాటు చేశారు. రాత్రి సమయంలో కూడా ఆదర్శమూర్తుల కోసం తెలుసుకునే అవకాశం కలిగిందని సందర్శకులు హర్షం వ్యక్తం చేస్తున్నారు.

స్థానికులకు 75 రిజర్వేషన్ కోసం వినతి



కేంద్ర మంత్రికి వినతి పత్రం అందిస్తున్న హేమంత్ కుమార్

బీచ్ రోడ్డు: ప్రభుత్వ రంగ సంస్థల్లో స్థానిక నిరుద్యోగులకు 75 శాతం రిజర్వేషన్ కల్పించాలని కేంద్ర మానవ వనరుల శాఖ మంత్రి ధర్మేంద్ర ప్రధాన్‌ను ఏపీ నిరుద్యోగ జేఏసీ రాష్ట్ర అధ్యక్షుడు సమయం హేమంతకుమార్ కోరారు. ఈ మేరకు శుక్రవారం నగరంలోని ఒక హోటల్‌లో మంత్రిని కలిసి వినతి పత్రం అందజేశారు. ఉన్నత పాఠశాలల్లో సంస్కృతం సబ్జెక్ట్‌ను కొనసాగించాలని కోరారు. జాతీయ విశ్వవిద్యాలయాల్లో స్థానికులకు ఉద్యోగాలు కల్పించాలన్నారు. స్టీల్‌ప్లాంట్ ప్రైవేటీకరణ ప్రక్రియను నిలిపి స్థానికంగా భూములు ఇచ్చిన నిర్వాసితులకు ఉద్యోగాలు కల్పించాలని డిమాండ్ చేశారు. ఈ కార్యక్రమంలో వీఆర్‌కే శర్మ, టి.మధుసూదన్‌రావు, తదితరులు పాల్గొన్నారు.

ఫ్రైడే డ్రైడేలో భాగస్వాములు కావాలి



మద్దిలపాలెంలో ఫ్రైడే డ్రైడే కార్యక్రమాన్ని పరిశీలిస్తున్న మలేరియా సూపర్‌వైజర్ రత్నం, సిబ్బంది

మద్దిలపాలెం : దోమల నివారణకు ప్రతి శుక్రవారం అమలు చేస్తున్న డ్రైడే కార్యక్రమంలో ప్రతి ఒక్కరూ భాగస్వాములు కావాలని మలేరియా సబ్ యూనిట్ సూపర్‌వైజర్ రత్నం కోరారు. ఫ్రైడే డ్రైడే కార్యక్రమాన్ని జీవీఎంసీ 23వ వార్డు మద్దిలపాలెంలో శుక్రవారం ఆయన పరిశీలించారు. జీవీఎంసీ యాంటి మలేరియా బృందం చేపడుతున్న చర్యలను తనిఖీ చేశారు. ప్రతి ఇంటికి వెళ్లి పరిసరాల్లో ఉన్న నీటి నిల్వల్లో లార్వా ఉన్నదీ లేనిదీ గుర్తించాలని సూచించారు. ప్రతి శుక్రవారం ఇళ్లలో నీటి నిల్వలు లేకుండా చూసుకోవాలన్నారు. వారం పైగా నీరు నిల్వ ఉంటే దోమల ఉత్పత్తి అవుతాయనే విషయాన్ని ప్రజలకు తెలియజేయాలని సూచించారు. ఈ కార్యక్రమంలో మలేరియా సబ్ యూనిట్ హెల్త్ అసిస్టెంట్ కె.ఎస్.శ్రీనివాసరెడ్డి, రాముడునాయుడు, శేషులు, యాంటి లార్వా బృందం సభ్యులు పాల్గొన్నారు.

బాణావతు కొండలకు ఏయూ డాక్టరేట్

ఎంవీపీ కాలనీ: ఏయూ ఇంజినీరింగ్ కళాశాల పరిధిలోని ఎలక్ట్రికల్ అండ్ కమ్యూనికేషన్ ఇంజినీరింగ్ విభాగ పరిశోధక విద్యార్థి బాణావతు కొండలుకు డాక్టరేట్ లభించింది. ఏయూ వీసీ ఆచార్య ప్రసాదరెడ్డి చేతుల మీదుగా కొండలు శుక్రవారం డాక్టరేట్ పట్టాను స్వీకరించారు. ఆచార్య ఎస్.అరుణ పర్యవేక్షణలో 'డిజైన్ అండ్ డెవలప్‌మెంట్ ఆఫ్ ప్లానర్ అండ్ కన్‌ఫార్మల్ యాంటిన్నాస్ ఫర్ వైడ్ బ్యాండ్, అల్ట్రా వైడ్ బ్యాండ్ అండ్ సూపర్ వైడ్ బ్యాండ్ అప్లికేషన్స్' అంశంపై చేసిన పరిశోధనకు ఆయనకు ఈ డాక్టరేట్ వరించింది. ఈ సందర్భంగా పలువురు విభాగ ఆచార్యులు, పరిశోధకులు కొండలును అభినందించారు.

జాబ్ మేళాకు విశేష స్పందన



అభ్యర్థులకు సూచనలిస్తున్న ఎంప్లాయిమెంట్ అధికారులు

కంచరపాలెం: స్థానిక జిల్లా ఉపాధి కార్యాలయంలోని నేషనల్ కెరీర్ సర్వీస్ సెంటర్‌లో ఆంధ్రప్రదేశ్ డిపార్ట్‌మెంట్ ఆఫ్ స్కిల్ డెవలప్‌మెంట్ అండ్ ట్రైనింగ్ ఆధ్వర్యంలో శుక్రవారం నిర్వహించిన మెగా జాబ్ మేళాకు విశేష స్పందన లభించిందని జిల్లా ఎంప్లాయిమెంట్ అధికారి సిహెచ్.సుబ్బిరెడ్డి(క్లరికల్) తెలిపారు. రక్షిత డ్రగ్స్, ఏడీఎల్ ఆగ్రో ఫార్మా, ఆటోమోటివ్ మ్యానిఫ్యాక్చర్స్, రక్షిత్ ఫార్మాసిటికల్, టీం లీజ్ యూనియన్ బ్యాంక్, శ్రీరామ్ లైఫ్ ఇన్సూరెన్స్ మొదలగు ప్రైవేటు లిమిటెడ్ కంపెనీల్లో 282 ఖాళీల భర్తీకి ఇంటర్వ్యూలు జరిగాయి. వీటికి 297 మంది అభ్యర్థులు హాజరు కాగా.. 74 మంది ఎంపికైనట్లు ఆయా సంస్థల ప్రతినిధులు చెప్పారు. ఎంపికైన వారి సర్టిఫికెట్లను పరిశీలించి, సుబ్బిరెడ్డి చేతుల మీదుగా నియామక పత్రాలు అందజేశారు. రాష్ట్ర ప్రభుత్వం పలు ప్రైవేటు కంపెనీలను ప్రోత్సహించడంతో వాటిలో నేరుగా నిరుద్యోగులకు ఉద్యోగావకాశాలు కల్పిస్తున్నారని ఆయన పేర్కొన్నారు. కార్యక్రమంలో ఎ.సంగీత, ఆయా సంస్థల ప్రతినిధులు పాల్గొన్నారు.

లక్ష్మీదేవి వెండి ప్రతిమల బహూకరణ



వెండి ప్రతిమలు బహూకరిస్తున్న ఈవో శిరీష తదితరులు

డాబాగార్డెన్స్ : కనకమహాలక్ష్మి దేవస్థానంలో శ్రావణలక్ష్మి పూజలో పాల్గొన్న ఇద్దరు భక్తులకు లక్ష్మీదేవి వెండి ప్రతిమలు లక్కీ డ్రా తీసి ఈవో కె. శిరీష చేతుల మీదుగా అందజేశారు. ఆలయ మాజీ చైర్మన్ వంకాయల సన్యాసిరాజు (తాతాజీ) సహకారంతో ఈ కార్యక్రమం నిర్వహించారు. ఏఈవో కె. తిరుమలేశ్వరరావు, సిబ్బంది పాల్గొన్నారు.

కళాభారతిలో నేడు నృత్యోత్సవం

మద్దిలపాలెం : సంస్కృత కథక్ విద్యాలయం ఆధ్వర్యంలో మద్దిలపాలెం కళాభారతి ఆడిటోరియంలో శనివారం పంచ వర్ష నృత్యోత్సవం నిర్వహించనున్నామని నిర్వాహకుడు వెంకటరమణ తెలిపారు. సాయంత్రం 6.30 గంటలకు ప్రారంభమయ్యే ఈ వేడుకకు అందరూ ఆహ్వానితులేనన్నారు. కథక్ నృత్య ప్రదర్శన ఉంటుందని తెలిపారు.

సకల కళాకారుల సంఘం గౌరవాధ్యక్షుడిగా 'కంచెర్ల'

ఆరిలోవ: విశాఖ సకల కళాకారుల సంఘం గౌరవాధ్యక్షుడిగా ఉపకార్ ట్రస్ట్ వ్యవస్థాపకుడు కంచెర్ల అచ్యుతరావు ఎన్నికయ్యారు. శుక్రవారం ఆరిలోవ ట్రస్ట్ కార్యాలయంలో సకల కళాకారుల సంఘం సభ్యులు సమావేశమయ్యారు. ఈ మేరకు అచ్యుతరావుకు సంఘం ప్రధాన కార్యదర్శి చెన్నా తిరుమలరావు నియామక పత్రం అందజేశారు. ఈ కార్యక్రమంలో సంఘం సభ్యులు పాల్గొన్నారు.


చార్టెడ్ అకౌంట్స్‌లో టెక్నాలజీ అవసరం



మాట్లాడుతున్న చార్టెడ్ అకౌంట్ ఆఫ్ ఇండియా చైర్మన్ ప్రశాంత్‌కుమార్

మద్దిలపాలెం : చార్టెడ్ అకౌంట్స్ ప్రాక్టీస్‌కు కొత్త టెక్నాలజీ అవసరం ఎంతైనా ఉందని ది ఇన్‌స్టిట్యూట్ ఆఫ్ చార్టెడ్ అకౌంటెంట్ ఆఫ్ ఇండియా విశాఖ బ్రాంచి చైర్మన్ ప్రశాంత్‌కుమార్ పండా తెలిపారు. రెండు రోజుల పాటు నగరంలో జరిగే చార్టెడ్ అకౌంటింగ్ సిస్టంలో ఆధునిక టెక్నాలజీ అంశంపై అవగాహన సదస్సును ఆయన శుక్రవారం ప్రారంభించారు. ఈ సందర్భంగా ప్రశాంత్‌కుమార్ మాట్లాడుతూ భవిష్యత్‌లో ప్రాక్టీస్‌ను దృష్టిలో పెట్టుకుని ఆధునిక పోకడల గురించి తెలుసుకోవాలని సూచించారు. ముఖ్యఅతిథులుగా సీఏఐ ప్రెసిడెంట్ అనికేత్ సునీల్ తలాతి, గౌరవాధ్యక్షుడు ఎస్ఐఆర్, అధ్యక్షుడు ఎస్.పన్నారాజులు, పీడీసీ కమిటీ చైర్మన్ సిఏ ప్రసన్నకుమార్ పాల్గొని ప్రసంగించనున్నారని ఆయన తెలిపారు.

ఫోర్త్‌టౌన్ సీఐగా విజయకుమార్ బాధ్యతల స్వీకరణ



విధుల్లో సీఐ విజయకుమార్

సీతమ్మధార: నాలుగో పట్టణ పోలీస్ స్టేషన్ సీఐగా ఎస్.విజయ కుమార్ శుక్రవారం బాధ్యతలు స్వీకరించారు. 2002 బ్యాచ్‌కు చెందిన ఆయన మొదటి సారి పీఎస్ఐ కొత్తూరు, ఎస్ఐగా బత్తిలి, సంతబొమ్మలి, ఎచ్చెర్ల, హిరమండలం, స్పెషల్ బ్రాంచ్, జీఆర్‌పీ, సీఐగా ప్రమోషన్‌తో శ్రీకాకుళం ట్రాఫిక్, రణస్థలం(జేఆర్ పురం), నక్కపల్లి, సీఐడీ, ద్వారకా క్రైం, కంచరపాలెం పోలీస్ స్టేషన్లలో విధులు నిర్వహించారు. ప్రస్తుతం బదిలీపై ఫోర్త్ టౌన్ సీఐగా వచ్చారు. ఈ సందర్భంగా విజయకుమార్‌ను సిబ్బంది మర్యాదపూర్వకంగా కలిశారు.

రైల్వే టీటీఈకి అభినందన



రైలులో పోగొట్టుకున్న బంగారు ఉంగరాన్ని ప్రయాణికుడికి అందిస్తున్న

తాటిచెట్లపాలెం: ఈస్ట్ కోస్ట్ రైల్వే వాల్తేర్ డివిజన్, కమర్షియల్ విభాగంలో ట్రైన్ టికెట్ ఎగ్జామినర్(టీటీఈ)గా విధులు నిర్వర్తిస్తున్న డి.ఆర్.ఎం.రెడ్డి నిజాయితీని పలువురు ప్రశంసించారు. రైల్లో ఓ ప్రయాణికుడు మరచిపోయిన బంగారు ఉంగరాన్ని తిరిగి అతడికి ఆయన అందజేసి నిబద్ధతను చూపారు. వివరాలిలా.. శివ కరణం అనే ప్రయాణికుడు ఈ నెల 23న బెంగళూరు–హౌరా రైలు థర్డ్ ఏసీ కోచ్‌లో తిరుపతిలో బయలుదేరి 24న విశాఖకు చేరుకున్నాడు. ఇక్కడ గురువారం ఉదయం తన కుటుంబ సభ్యులతో కలిసి రైలు దిగిపోయాడు. కొద్దిసేపటికి తన గోల్డ్ రింగ్ రైలులో పోగొట్టుకున్నట్టు అతడు గుర్తించి లాబీలో ఆన్‌డ్యూటీలో ఉన్న టీటీఈకి సమాచారం అందించాడు. వెంటనే స్పందించిన ఆయన బెంగళూరు–హౌరా రైలులో విధి నిర్వహణలో ఉన్న టీటీఈ డి.ఆర్.ఎం.రెడ్డికి సమాచారం చేరవేశారు. ఈయన తక్షణం శివ ప్రయాణించిన బెర్త్ వద్దకు వెళ్లి తనిఖీ చేసి

వ్యక్తి ఆత్మహత్య

మర్రిపాలెం: ఓ వ్యక్తి ఫ్యాన్‌కు ఉరి వేసుకుని ఆత్మహత్యకు పాల్పడిన ఘటన కంచరపాలెం ఐదో పట్టణ పోలీస్ స్టేషన్ పరిధిలో జరిగింది. పోలీసులు తెలిపిన వివరాలిలా.. కంచరపాలెం ఇందిరానగర్–4లో నివసిస్తున్న గొర్లె పవన్(29) గురువారం అర్ధరాత్రి ఆత్మహత్యకు పాల్పడ్డాడు. ఇతడికి భార్య, కుమారుడు ఉన్నారు. భార్యతో ఎటువంటి విభేదాలు లేవు. బీటెక్ చదివి కొంత కాలం సాఫ్ట్‌వేర్ ఉద్యోగం చేసేవాడు. ప్రస్తుతం ఉద్యోగం ఏమీ చేయడం లేదు. శుక్రవారం మృతుడి తండ్రి గొర్లె రామారావు ఫిర్యాదు మేరకు సీఐ ఎస్.సాయి నేతృత్వంలో హెడ్ కానిస్టేబుల్ అబద్దం కేసు దర్యాప్తు చేపట్టారు. ఆర్థిక ఇబ్బందుల లేక అనారోగ్య సమస్యలా అన్న కోణంలో మృతికి గల కారణాలపై దర్యాప్తు చేస్తున్నారు.



ముఖ్యమంత్రిని కలిసిన ఎమ్మెల్సీలు





ఆరిలోవ : విజయనగరం పర్యటన ముగించుకుని విశాఖ విమానాశ్రయానికి చేరుకున్న ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డిని శుక్రవారం ఎమ్మెల్సీలు వంశీకృష్ణ శ్రీనివాస్, వరుదు కల్యాణి మర్యాద పూర్వకంగా కలిసి పుష్పగుచ్ఛాలు అందజేశారు. ఎయిర్‌పోర్టులో కేంద్ర మంత్రి ధర్మేంద్ర ప్రధాన్‌కు వారిని సీఎం జగన్ పరిచయం చేశారు.

ఘనంగా శ్రావణమాసం పూజలు



పెదవాల్తేరు పోలమాంబ ఆలయంలో పూజలు చేస్తున్న మహిళలు



పోలమాంబ ఆలయంలో ప్రత్యేక అలంకరణలో అమ్మవార్లు

ఆరిలోవ: శ్రావణ మాసం రెండో శుక్రవారం పూజలు తూర్పు నియోజకవర్గంలో ఘనంగా జరిగాయి. మహిళలు అధిక సంఖ్యలో ఇళ్లలో వరలక్ష్మీదేవి పూజలు చేసి, అనంతరం అమ్మవారి ఆలయాలను దర్శించుకున్నారు. ఆరిలోవ, ఇసుకతోట, పెదవాల్తేరు, మద్దిలపాలెం తదితర ప్రాంతాలలో అమ్మవారికి పూజలు, అభిషేకాలు చేశారు. హనుమంతవాక వద్ద విజయదుర్గ ఆలయం, బాలాజీనగర్‌లో దుర్గాలమ్మ, నూకాలమ్మ ఆలయాలు, దుర్గాబజార్‌లో దుర్గాదేవి గుడి, పెదవాల్తేరు పోలమాంబ ఆలయంలో అమ్మవార్ల దర్శనానికి అధిక సంఖ్యలో భక్తులు బారులు తీరారు. ఆయా ఆలయాల్లో అమ్మవార్లను అర్చకులు వివిధ రకాల పూలతో అలంకరించారు.

అధునాతన ఔషధాలతో క్యాన్సర్ నివారణ



డాక్టర్ మాధవిని సన్మానిస్తున్న ఏఎంసీ ప్రిన్సిపాల్ డాక్టర్ బుచ్చిరాజు

మహారాణిపేట : క్యాన్సర్ వ్యాధి నివారణకు అధునాతన పద్ధతులు, ఔషధాలు వచ్చాయని అమెరికాలో స్థిరపడ్డ ఆంధ్ర వైద్య కళాశాల పూర్వ విద్యార్థిని, ప్రముఖ మెడికల్ అంకాలజిస్టు డాక్టర్ గొరుసు మాధవి అన్నారు. శుక్రవారం ఆంధ్ర వైద్య కళాశాల అకాడమీ ఆఫ్ మెడికల్ సైన్సెస్ ఆధ్వర్యంలో నిర్వహించిన కామన్ టీచింగ్ ప్రోగ్రామ్‌లో భాగంగా 'ప్రివెన్షివ్ మెడిసిన్–అంకాలజీ'అన్న అంశంపై జరిగిన కార్యక్రమంలో ఆమె ప్రసంగించారు. ఆహారపు అలవాట్లు, ఇతర కారణాల వల్ల ప్రపంచంలో క్యాన్సర్ వ్యాధి పెరుగుతోందని అన్నారు. మద్యం, ధూమపానం, వంశపారంపర్యంగా ఈ వ్యాధి సోకుతోందన్నారు.

తొలి దశలో క్యాన్సర్‌ను గుర్తిస్తే పూర్తిగా నియంత్రించవచ్చన్నారు. ఈ సమావేశంలో ఆంధ్రా మెడికల్ కాలేజీ ప్రిన్సిపాల్ డాక్టర్ జి.బుచ్చిరాజు, వైస్ ప్రిన్సిపాళ్లు డాక్టర్ రాజేంద్రప్రసాద్, డాక్టర్ మన్మథరావు, ఏఎంఎస్ వైస్ ప్రెసిడెంట్ డాక్టర్ కేపీవీ సుబ్రహ్మణ్యం, కేజీహెచ్ మెడికల్ అంకాలజీ విభాగాధిపతి డాక్టర్ కె.శిల్ప, డాక్టర్ పీఎస్ఎన్ రాజు తదితరులు పాల్గొన్నారు. డాక్టర్ మాధవిని ఏఎంసీ ప్రిన్సిపాల్ బుచ్చిరాజు సన్మానించి జ్ఞాపిక అందజేశారు.

వ్యక్తిని బెదిరించి నగదు అపహరణ

- అడవివరంలో ఘటన
- సీసీ ఫుటేజీ ఆధారంగా ముగ్గురి అరెస్ట్

సింహాచలం: వ్యక్తిని బెదిరించి...ఏటీఎంకి తీసుకెళ్లి నగదు అపహరించిన ఘటన జీవీఎంసీ 98వ వార్డు అడవివరం జంక్షన్‌లో చోటుచేసుకుంది. వివరాలు.. నగరంలోని వెంకోజీపాలెం ప్రాంతానికి చెందిన ఉమామహేశ్వరరావు(25) నూవల్ డాక్‌యార్డులో ఫిట్టర్‌గా పని చేస్తున్నాడు. ఉమామహేశ్వరరావు గురువారం చీడికాడవెళ్లి తిరిగి రాత్రి సుమారు 10గంటల సమయంలో వెంకోజీపాలెం వెళ్తూ అడవివరం జంక్షన్‌లోని ప్రభుత్వ మద్యం దుకాణం సమీపంలో మద్యం సేవిస్తున్నాడు. అక్కడికి ముగ్గురు వ్యక్తులు ఆటో, ద్విచక్రవాహనంపై వచ్చారు. నగదు ఇవ్వాలని ఉమామహేశ్వరరావును బెదిరించారు. బలవంతంగా బైకుపై అడవివరంలోని శ్రీ వరాహ లక్ష్మీ నృసింహస్వామి తొలిపావంచా ఎదురుగా ఉన్న యూనియన్ బ్యాంక్ ఆఫ్ ఏటీఎం వద్దకు తీసుకువెళ్లి ఖాతాల్లో ఉన్న రూ.4 వేలు విత్ డ్రా చేయించి తీసుకుని అక్కడి నుంచి ఉడాయించారు. దీంతో ఉమామహేశ్వరరావు కంట్రోల్‌రూమ్‌కి ఫోన్ చేసి విషయం తెలిపాడు. సమాచారం అందుకున్న పెందుర్తి క్రైం ఎస్ఐ సల్మాన్ బేగ్ శుక్రవారం ఉదయం అడవివరంలోని మద్యం దుకాణం పరిసరాలతో పాటు అలాగే యూనియన్ బ్యాంక్ ఏటీఎం వద్ద పరిశీలన జరిపారు. సీసీ ఫుటేజీల ఆధారంగా ముగ్గురిని గుర్తించారు. గోపాలపట్నం ప్రాంతానికి చెందిన ఇద్దరిని, ఆరిలోవ ప్రాంతానికి చెందన ఒకరిని గుర్తించి అరెస్టు చేశారు.

గౌడ ఎడ్యుకేషనల్ అవార్డుల ప్రదానం రేపు



మాట్లాడుతున్న ప్రసాద్

డాబాగార్డెన్స్: విశాఖ జిల్లా గౌడ సంఘం ప్రతి ఏటా జరుపుకునే వార్షికోత్సవంలో భాగంగా ఈ నెల 27న గౌడ ఎడ్యుకేషనల్ అవార్డులు, వివాహ పరిచయ వేదిక నిర్వహించనున్నట్టు సంఘం గౌరవ అధ్యక్షుడు జెర్రిపోతుల ప్రసాద్, అధ్యక్షుడు మార్గాన రామారావు తెలిపారు. శుక్రవారం కాన్వెంట్ జంక్షన్ సమీపాన గల గౌడ సంఘం కార్యాలయంలో నిర్వహించిన సమావేశంలో వారు మాట్లాడుతూ ఆ రోజు ఉదయం 8 నుంచి సాయంత్రం 5 గంటల వరకు సంఘ కార్యాలయంలో నిర్వహించనున్న ఈ కార్యక్రమంలో ఎమ్మెల్యే వాసుపల్లి గణేష్‌కుమార్ చేతుల మీదుగా గౌడ విద్యార్థులకు అవార్డులు అందజేయనున్నట్టు చెప్పారు. అనంతరం వివాహ పరిచయ వేదిక నిర్వహిస్తామన్నారు. ఈ అవకాశాన్ని గౌడ విద్యార్థులు, పరిచయ వేదికను గౌడ సంఘీయులు వినియోగించుకోవాలని కోరారు. సమావేశంలో సంఘం రాష్ట్ర అసోసియేట్ ప్రెసిడెంట్ కామన వెంకట సుబ్బారావు, వైస్ ప్రెసిడెంట్ సుందరరావు, కొయ్యల సత్యనారాయణ, నిచ్చనకోళ్ల వెంకటరావు, సంఘ సభ్యులు పాల్గొన్నారు.

